శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!!

# గురుకృప

గురోవినతిమీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!



ఓ సద్గురూ! నా హృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!



**సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!!**

ప్రజలందరి నోట సాయి నామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరి గొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయి వంటి దైవంబు లేడోయి! లేడోయి!!' అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
-- అదే నాఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

--- శ్రీ బాబూజీ

## ఈ సంచికలో



1. సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!!
2. ఉన్నమాట - అనుకున్నమాట — గురుబంధువులు
3. ఆలోచన - అవలోకన
   బోర్లించిన ఘటాన్నైనా వైనంగా గురువు ఉపయోగించు ఘనంగా — జి. సంధ్యారాణి
   అజ్ఞానులను సుజ్ఞానులగా, మట్టి కుండలను మార్చగల్గింది గురువేగా... — సత్యస్వరూప్
4. గురుకృప-గురుకృపే — జి. నాగిరెడ్డి అన్నపూర్ణ
5. సర్వకాల, సర్వావస్థల యందు కాపాడును గురువు — ఎమ్ దుర్గ, రాజశేఖరరెడ్డి
6. సద్గురు సందర్శనమే అన్నింటికి ఆలవాలము — ఎన్. తులసి
7. సాయిపథం హాయి(యీ) పథం — శ్రీమతి శేషారత్నం మూర్తి
8. బాబూజీ సారధిగా — పులిపాటి వరలక్ష్మి
9. గురువేభిషగ్వరుడు — నంబూరు హేమలత
10. నాటి బాబా-నేటి గురువే — నాగసాయి
11. ఆచేయి ఎంత హాయి — డా॥ ఎన్. సాయివరప్రసాదరావు
12. మహనీయుల-మహితోక్తులు — గురుచరణదాసుడు

# ఉన్నమాట - అనుకున్నమాట

'నైనా అంతర ఆవ్ తూఁజ్యోఁహీ నైన్ ఝపే ఊ
నాహౌ దేఖూ ఔర్‌కూనాతుమ్హ్ దేఖనదే ....(కబీరు)

కన్నులు మూసి కొనినప్పుడూ ఆకళ్ళలో తామే ఉండెదరు. ఇతరాన్ని నేచూడను, మిమ్ములను నే చూడనీయను. (నన్ను మీరు, మిమ్ములను నేను చూడవలెను. పరస్పరము ఒకరివైపుకు మరొకరు చూడటము, జగత్తంతా వారిద్దరే తప్ప మరొకరులేరని అన్వయించుకోవాలి.) (సాధువ్యాఖ్య). నాదన్నది ఏదీలేదు. మీదికానిది నాలో లేనిదేదీలేదు. నీది నీకందిచుటలో నాదేమీ పోలేదు.

గురువు పట్ల అనన్య భావనతో ప్రార్ధించు. కబీరు హృదయమది. 'గురువు' తప్ప ఇతరమెరుగని ప్రవర్తకుని మాటది. ప్రతి అంశములోను గురువును దర్శించు యోగస్థితి అది. మనందరి ఆరాధ్య గురుదేవులు అంతే. ఎందరెందరో వార్ని దర్శించినప్పుడు అనుకొనేమాట.



ఇన్ని శతాబ్ధములు సాగుచున్న సృష్టి, వట్టి పోయెనే సాధు సంపత్తి లేక
ధర్మసంస్థాపనార్థమై ధరణినుద్భవించదె, దశాబ్ది కొక్క వివేకజ్యోతి (భక్తిభరిణెనుండి)

లేకుంటే 2002 జనవరి నూత్నసంవత్సరారంభంలో గురువుగార్ని ఎందరెందరో, ఎక్కడెక్కడినుంచో వచ్చి దర్శించారు. వారి అనుభవాన్నే ఉన్నమాటగా వ్రాస్తున్నాము.

గురుదేవులను దర్శించినంతమాత్రానే 'తృప్తి' కలుగుతుంది. ఇంకా ఇంకా ఆ తృప్తి అనంతంగా సాగాలంటే సందర్శకులు గురువుగార్కి పాదనమస్కారం చేసి వారి చేతి మీదగా వూది అందుకున్న తరుణాన వారి ఆనందమే ఆనందము. ఎన్ని వేలమంది ఈ మారు సాయియానకు వచ్చారో వారందరిని గురువుగారు అనుగ్రహించి ఆనందపర్చి వారి వారి కోర్కెలు సఫలీకృతమయ్యేలా బాబాను ప్రార్ధించారు. వారెంతో ఆదరంగా పల్కరించారని, మేము చెప్పిందంతా విని 'శుభం', 'బాబా ఉన్నారు', 'మంచిది', 'మీ అనుకూలాన్ని బట్టి చేయండని' - ఇలా ఆశీర్వదించారని, ఇది మాకెంతో అనిర్వచనీయమైన అనుభూతినిచ్చిందని గురుబంధువులు గురుకృపకు తెలియజేసారు. మేమెంతో దూరంనుంచి వచ్చినా, ప్రయాణంలో శ్రమను అనుభవించినా, వారి కెదురుగా కూర్చోని, మా కష్టాలు వారికి తెలియజేసుకొని, వారి పాదాలకు నమస్కరించుకొని, వారిచేతి మీదగా వూది అందుకున్నప్పుడు మేము అనుభవించిన ఆనందం మరువలేనిది. ఆ ఆనందంలో, మేం పడిన కష్టం మర్చిపోయాం. వారి పలకరింపు, ఆదరణ, ఆప్యాయతలు చెప్పనలవికానివని ఎందరో గురుబంధువులు చెప్పారు. ఇదెవరికి సాధ్యపడుతుంది. ఎలాంటి వారికాస్థితి కలుగుతుంది. ఆలోచించండి. కబీరు చెప్పిన పైమాటలు మరో సారి మననం చేయండి. బాబా తప్ప, అన్యభావన లేని వారికే ఇటువంటి స్థితికలుగుతుంది. 'నీవెవరో తెలుసుకుంటె నీవేనేనుగా అనుభూతమవుతాను' అన్న నిత్య ప్రార్ధనలోని భావాన్ని గమనిద్దాం. బాబా అంటే ఏమిటో గురువుగార్కి అనుభవమైనది. అందుకే వారిలో ఆస్థితి కలిగింది. అందరినీ ఆదరించి, ఆనందపర్చి అనుగ్రహించగల్గుతున్నారు.

ఈ సారి గురుబంధువుల స్పందన గురుకృపకు అందినది. 'ఆలోచన-అవలోకన' అన్న శీర్షికను ఆదరించారు. సంతృప్తికరమైన వ్యాసాలు పంపారు. 'నాదగ్గరకు వచ్చినకుండలన్నీ బోర్లించినవే' అన్న శీర్షికపై వచ్చిన వాటిల్లో కొన్నింటిని గురుబంధువులకు గురుకృప అందివ్వబోతున్నది. తెనాలిలో జరిగిన వార్షికోత్సవ విషయాలను కళ్ళకుకట్టినట్లుగా వ్యాసాన్ని పంపారు. వారిని అభినందిస్తూ... ఈ పవిత్రమైన పుస్తకాన్ని వృధాగా ఉంచకుండా అందరితో చదివించి గురుసేవ అనే యజ్ఞంలో పాలుపంచుకుందాం. గురువనుగ్రహంతో సాధ్యపడనిదేముంటుంది. సత్సంగ నిర్వాహకులు. సత్సంగ కేంద్రాలవారు 'గురుకృపను' ఆదరించాలని, ఈ చిత్రభాను ఉగాది మనందరికి బాబా ఆశీస్సులు - గురుదేవుల అనుగ్రహాన్ని, గురుబంధువులప్రోత్సాహాన్ని అన్నింటిని కలగాపులగంగా కలిపి ఉగాది పచ్చడి మాదిరిగా మనందరికి కొత్తకొత్త విషయాలు తెలియజేయాలని కోరుతూ, సెలవు.... వచ్చే సంచిక ఆలోచన అవలోకన శీర్షికలో 'భగవంతుడిచ్చింది పోదు మానవుడు ఇచ్చింది నిలువదు' పై బాబా పలుకులకు మీ స్పందన ఆశిస్తూ....

## ఆలోచన-అవలోకన

### 'బోర్లించిన ఘటాన్నైనా వైనంగా గురువు ఉపయోగించు ఘనంగా'

'నా దగ్గరకి వచ్చిన కుండలన్నీ బోర్లించిన కుండలే' అన్న బాబా సూక్తికి స్పందించిన నా మనసు, తన మనోభావాలనిలా వ్యక్తపరుస్తోంది.

బోర్లించిన కుండలు ఒక్క ఆకాశానికి తప్ప (శూన్యం) మరింకెందుకూ ఉపయోగపడవు. ఆ బోర్లించిన కుండని ఎవరయినా కొని, దానిని నీటితో కడిగి, శుభ్రపరచి మంచినీరు నింపినచో అది ఎంతో ఉపయోగకారి అవుతుంది. దాన్ని ఏదయినా చలివేంద్రంలో వుంచితే పదిమంది దాహార్తుల దాహాన్ని తీర్చే అమృత కలశమవుతుంది.

మానవజన్మ కూడా ఒక బోర్లించిన కుండ వంటిదే. ఆ బోర్లించిన కుండకి, ఆధ్యాత్మిక చింతన లేని మనిషికి ఏమి తేడాలేదు. ఇలాంటి మానవ కుండలని ఏ సద్గురువు అయినా ఆదరించి దగ్గరకు తీసి, వాటిని (వారి మనసులని) శుభ్రపరచి, ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తే వాటి జన్మ ధన్యమవుతుంది.

సద్గురువు లభించని ప్రతి మనిషి ఒక బోర్లిచిన కుండే. తన కరుణాభరిత వీక్షణాలతో ఈ కుండలని సంస్కరించి, తన ప్రేమ రసమనే మంచినీటితో వీటిని నింపి, నలుగురి కోసం బ్రతికేట్లు చేయగల శక్తి ఒక్క సద్గురువుకి మాత్రమే ఉన్నది.

కాబట్టి ఏ మనిషి జీవితం బోర్లించిన కుండ కాకూడదు. ఆ కుండలని త్రిప్పి సరయిన పద్ధతిలో నిలబెట్టి తన ప్రేమామృతాన్ని నింపి, అందరినీ సన్మార్గంలో నడిపించే సద్గురువు శ్రీసాయినాధుని శరద్‌బాబూజీని పొందిన మనందరి జీవితాలు నిండు కుండలని నేను భావిస్తున్నాను.

జి. సంధ్యారాణి (శిరిడీ)

# అజ్ఞానులను సుజ్ఞానులుగా, మట్టి కుండలను మార్చగల్గింది గురువేగా..

శ్రీ పూజ్య సద్గురుదేవులు శ్రీసచ్చిదానంద సర్వసమర్థ సద్గురు శ్రీసాయినాధుని శరత్‌బాబా మహరాజ్ దివ్య పాదపద్మములకు నమస్కరిస్తూ...

నా పేరు సత్యస్వరూప్ నేను 'గురుకృప' అను త్రైమాసిక పత్రికను మొట్టమొదటి సారిగా సాయి అంకుల్ వలన చదవడం జరిగింది. అది చదివినప్పటి నుండీ నాలో నూతనోత్సాహం కలిగింది. ఈ పత్రికను ఎన్నిసార్లు చదివినా మరలా మరలా చదవాలి అనిపించేలా ఉంది. నేను ఇప్పటివరకూ సాయి భగవాన్ మీద వచ్చిన ఎన్నో పత్రికలు చదివినప్పటికీ, ఈ పత్రిక నాకు చాలా ఆనందమును కలిగించింది.

శ్రీబాబూజీ గారు రచించిన 'సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!' అన్న ప్రార్థన ఎన్నిసార్లు చదివానో నాకే తెలియదు. ఎంతసేపు చదివినా దానిలో తీరని దాహార్తి ఉంది. కవర్ పేజీలో గురువుగారే స్వయంగా రచించిన 'ఆనందదాయి అభయప్రదాయి' నాకు ఎంతగానో నచ్చింది. అందులోని ప్రతి అక్షరం ఒక్కొక్క ఆణిముత్యం. గురుబంధువులు గురువుద్వారా పొందిన అనుభూతులను రచించిన,తెలియపరచిన గురుమహత్యములు చాలా చక్కగా ఉన్నాయి. ఈ పత్రిక మీరు స్థాపించి నాలుగు వసంతములు గడిచినా చదవలేక పోయానని బాధపడ్డాను.



మీరు ప్రతిపేజీ క్రింద ఒక్కొక్క కొటేషన్ ఇచ్చారు. అలా రాయడం వలన ఆ పత్రికకే కొత్త అందం వచ్చింది. మీరు ఈ పత్రికలో 'ఆలోచన అవలోకన' అన్న శీర్షిక క్రింద 'నా దగ్గరకు వచ్చిన కుండలన్నీ బోర్లించిన కుండలే' అన్న 'బాబా' గారి సూక్తిని ప్రచురించారు. అదెంతగానో నచ్చింది.

బాబా సూక్తిపై నా వివరణ.:

'నా దగ్గరకు వచ్చిన కుండలన్నీ బోర్లించిన కుండలే' అంటే సాయిబాబా వద్దకు వచ్చినవారందరూ జ్ఞానం అనే కుండను బోర్లించిన వారే. అంటే అజ్ఞానంధకారములో ఉన్నారు, అని. అంటే అజ్ఞానులందరూ బాబా వద్దకువచ్చి సుజ్ఞానులయినారు అని ఒక అర్థంగా మనము తీసుకొనవచ్చు. రెండో అర్థముగా బాబా ఎవరి నుండి ఏమి ఆశించరు. బాబా నుండి మనము మన కోరికలు సిద్ధించాలని ఆశించినప్పటికీ బాబా మననుండి ఏమీ ఆశించడం లేదు, ఒక భక్తి అనే పుష్పము తప్ప. అజ్ఞానాంధకారములో ఉన్న మనమందరమూ బోర్లించిన కుండలతో సమానమే. ఎందువలననగా, బోర్లించిన కుండ ఏమి కలిగియుండదు. అదే విధంగా అజ్ఞానంధకారములో ఉన్నవారు కూడా, దాని యందు ఏమి నిలుపుకొనలేరు. అందువల్ల మనము అజ్ఞానంధకారం నుండి బయటపడుటకు, భక్తి అనే పుష్పమును బాబాకి సమర్పించి సుజ్ఞానము అనే ఫలమును పొందవలెను.

నేను కూడా ఒక అజ్ఞానినే కాబట్టి ఈ లెటర్‌లో నేను చేసిన పొరపాట్లను పెద్దలయిన మీరు పెద్దమనసుతో మన్నించెదరని ఆశిస్తూ ..........

ఇట్లు

సత్యస్వరూప్, గుంటూరు.

# గురుకృప-గురుకృప

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై

సద్గురు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ కీ జై

శ్రీపూజ్య సద్గురు దేవులు శ్రీ సచ్చిదానంద సర్వ సమర్ధ సద్గురుసాయినాథుని శరత్ బాబా మహరాజ్ దివ్య పాదపద్మములకు అనేక సాష్టాంగ నమస్కారములు చేసుకుంటూ శ్రీ గురుదేవులు చేసిన అద్భుత లీలను గురుబంధువులకు తెలుపుకుంటున్నాను.

నా పేరు నాగిరెడ్డిఅన్నపూర్ణ. మేము వైజాగ్ ఉడా కాలనీలో ఉంటున్నాము. మా అబ్బాయి ఇంటి నుండి 23-01-2002 న ఫ్రెండ్ ఇంటికి వెళ్ళి వస్తానని వెళ్ళి పోయాడు. ప్రతిరోజు మేము బాధతో వెతుకుతుండగా అటువంటి సమయంలో మా ఇంటి దగ్గరలో గురుబంధువులు అయిన లక్ష్మీగారు మా ఇంటికి వచ్చి గురువుగారిని నమ్మండి. మీ అబ్బాయి మీ ఇంటికి వచ్చేస్తాడు అని 'గురుకృప' పుస్తకము ఇచ్చి మమ్ములను ఓదార్చినారు. తరువాత నేను గురుకృప పుస్తకము చదివి ఉక్కునగరములో ఉంటున్న సునీతారెడ్డి గారి ఇంటికి వెళ్ళినాను. వాళ్ళతో నా పరిస్థితి అంతా చెప్పి బాధ పడినాను. వెంటనే వాళ్ళు సాయిబాబా ఫోటో, గురువు గారి ఫోటో, ఊది ఇచ్చి ఓదార్చినారు. గురువుగారిని నమ్ముకోండి. మీ అబ్బాయి ఇంటికి వచ్చేస్తాడు అని కొండంత ధైర్యం చెప్పారు. లక్ష్మీగారి అమ్మాయి శిరీష గారితో మాట్లాడి మేము, మా పరిస్థితి చెప్పిన వెంటనే శ్రీ ఎస్.వి.ఎల్. నారాయణరావుగారికి ఫోను చేసి, లత గారికి ఫోను చేసి గురువు గారికి తెలియజేయడానికి చాలా ప్రయత్నం చేసారు. తరువాత గురువుగారి, బాబాగారి ఫోటోలు మేము దేవుడి మందిరములో పెట్టినాము. తూర్పు వైపు పెట్టినాము. మేము ఉదయం లేచి చూసినప్పటికి బాబాగారి, గురువుగారి ఫోటోలు నార్త్ సైడ్ ఉన్నాయి. అప్పటికే గురువుగారు నిదర్శనము చూపారు. తరువాత సాయివరప్రసాదరావు గారు లక్ష్మి గారి ఇంటికి సత్సంగానికి వచ్చారు. శ్రీనివాసరావుగారికి, సాయివరప్రసాదరావు గారికి మేము మా పరిస్థితి, బాబు ఇల్లు విడిచి వెళ్ళిన వైనము చెప్పాము. 'గురుకృప' ఉన్నది మీరు అధైర్యపడకండని ఓదార్చినారు. మీ అబ్బాయి దొరుకుతాడని చెప్పారు. తరువాత ఈ-మెయిల్, లెటరు కూడా పంపించాము. మేము శనివారము నాడు శ్రీ బాబాగారి సత్సంగానికి లతగారి ఇంటికి వెళ్ళాము. ఆ తరువాత ఆదివారం సాయంత్రం బాబా ముందు బాధపడుతుండగా సాయంత్రం 5 గం॥ల 5 ని॥లకు బాబు కలకత్తాలో ఉన్నాడని ఫోన్ వచ్చింది. మేము గురువుగారికి, బాబాగారికి నమస్కారములు తెలుపుతూ, మా మీద ఎప్పుడు గురువుగారి అనుగ్రహములు ఉండాలి అని ప్రార్థిస్తున్నాము.

ఇట్లు

జి. నాగిరెడ్డి అన్నపూర్ణ.

*నిద్రను, తద్వారా మనస్సును నియమించే ప్రయత్నం లో (జాగ్రత్తగా వుండటమే)*
*జాగరూకులమై ఉండటమే జాగరణ అంటే*

## సర్వకాల, సర్వావస్థల యందు కాపాడును 'గురువు'

'గురుకృప' కు వ్రాయునది.

నా పేరు దుర్గ. మేము 'నేవి ముంబాయి' లోని నెరూల్ లో వుంటాము. సెప్టెంబరు 25న మావారికి జ్వరము వచ్చినది. రెండు రోజులయినను తగ్గక టైము ప్రకారము వచ్చుచున్నది. ఈలోగా వాంతులు కూడా ప్రారంభము అయినవి. రెండు రోజులు ఏమి త్రాగినను కడుపులో ఉండుటలేదు. అక్కడి డాక్టరు గారు బ్లెడ్, యూరిన్ పరీక్షలకు పంపించారు. ఆ రాత్రి గురువారము నేను ఫోన్ చేసి తిరుపతి లోని మా నాన్నకు పరిస్థితి చెప్పినాను. మా నాన్నగారు ఆ రాత్రి గురువుగారికి ఉత్తరము వ్రాసి పడుకున్నారు. తెల్లవారుజామున అనగా శుక్రవారము 'గురువుగారు' కలలో కనిపించి తగ్గిపోతుంది అని చెప్పారు. మాకు ముంబాయిలో డాక్టరుగారు శుక్రవారము రిపోర్ట్ చూసి వెంటనే హాస్పిటల్లో జాయిను చేయాలి, పచ్చకామెర్లు, మలేరియా జ్వరం (103.2c) ఉంది అని చెప్పారు. మావారికి అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకోవడం ఇష్టం లేదు. ఎందుకంటే వారు ఇంగ్లీషు మందులు మాత్రమే వాడుతారు. కామెర్లకు నాటుమందు తినాలి అని మేము తిరుపతి వెళ్ళాలని నిర్ణయించు కున్నాము. మా కంపెనీ మేనేజరు ఆ రిపోర్ట్సు చూసి ఒక నెల శెలవు ఇచ్చారు. అప్పటికప్పుడే బొంబాయి మెయిల్‌కు బయలుదేరి తిరుపతి వచ్చాము. బయలుదేరే ముందు కూడా (104c) జ్వరము, డాక్టరు వద్దన్నా 'బాబా' (గురువుగారి) పై భారం పెట్టి అన్నీ గురువుగారికి చెప్పుకొని బయలుదేరాము. మాకు రైలులో బెర్త్‌లు కూడా ఇప్పించారు. రైలు ఎక్కిన తరువాత జ్వరం, వాంతులు ఎటుపోయినవో, శనివారము అర్ధరాత్రికి తిరుపతి చేరుకున్నాము. ఆదివారము (SVIMS) లో అన్ని టెస్టులు చేయించారు. వాళ్ళు పచ్చకామెర్లు, మలేరియా జ్వరం లేదు అని చెప్పారు. అన్నీ తినమన్నారు. మేము 10 రోజులు తిరుపతిలో వుండి అక్టోబరు 15 కల్లా శిరిడీ చేరుకున్నాము. ఇది అంతయు గురువుగారు మాకు సెలవు ఇప్పించి శిరిడీలో ఉంచుటకు జరిగినదని భావిస్తున్నాము.

సర్వకాల, సర్వావస్థల యందు 'గురువుగారు' మమ్మల్ని కాపాడుతూ 'సాయిపథం' లో నడిపిస్తున్నారు.

గురువుగారికి మా సప్రేమ వందనములు

28-10-2001

ఇట్లు

ఎమ్ దుర్గ, రాజశేఖరరెడ్డి.

## సద్గురు సందర్శనమే అన్నింటికి ఆలవాలము

నా పేరు తులసి, మాది బుర్రిపాలెం, ఉండేది విజయవాడ, మొట్టమొదట నేను బుర్రిపాలెం సత్సంగానికి వెడుతుండేదాన్ని. నిజానికి నాకు వేంకటేశ్వరస్వామి అంటే మహా ఇష్టం. సత్సంగ సమయంలో 'బాబా' నామం చెప్పేదాన్ని. గురువుగారు గురించి నాకు తెలియదు కాబట్టి 'సచ్చిదానంద సద్గురు సాయినాథుని శరత్‌బాబూజీ కీ జై' అని చెప్పకుండా ఉండేదాన్ని.

కృష్ణా మాష్టారుగారు, విజయవాడలో నాళం ప్రసాదుగారి ఇంట్లో సత్సంగముజరుగుతుంది. అక్కడికి వెళ్ళమని చెప్పేవారు. మేము ఉండేది విజయవాడే కదా అని సత్సంగానికి వెళుతుండేదాన్ని. నేను సత్సంగములో గురువుగారి ఫోటో శ్రీనివాసరావు గారి చేతుల మీదుగా తీసుకొని ఇంట్లో పెట్టుకున్నాను. ఒక నెలలోనే అనుకోకుండా తిరుపతిలో గురువుగారి దర్శనము చేసుకున్నాను.

అందరి అనుభవాలు విన్న నేను, గురువు గారిని ఎప్పుడెప్పుడు చూద్దామా అని తపిస్తుండే దానిని. గురువుగారి దర్శనం చేసుకునే సమయములో గురువు గారి గదిలో అడుగు పెట్టిన నాకు గురువుగారు నా కోసము ఎదురు చూస్తున్నట్లు మరియు ఎప్పటి నుండో పరిచయమైన వారిలాగ గురువుగారు నవ్వినారు. ఆ రూపము మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకున్నది. ఎప్పుడూ ఆయన దగ్గరే ఉండిపోవాలని అనిపించినది.

గురువుగారి దర్శనము అయిన తరువాత నేను, మా అమ్మగారు వేంకటేశ్వరస్వామి దర్శనముకి గుడికి వెళ్ళినాము. జనము విపరీతంగా ఉన్నారు. సర్వదర్శనములో స్వామి దర్శనం 12 గం॥ పడుతుంది అన్నారు. కనుక సర్వ దర్శనములో వెళ్ళడం అనేది విరమించుకొని 30 రూ/- లు టికెట్లో వెళదాము అనుకున్నాము. కాని మాకు ఆ టికెట్స్ ఇచ్చేది ఎక్కడో తెలియలేదు. మేము మందిరం చుట్టూ తిరిగాము కాని ఆ టికెట్స్ ఇచ్చు 'క్యూ' ఎక్కడో కనబడలేదు. ఆ సమయంలో గురువుగారిని ప్రార్థించాను. ఆ 30- రూ॥ టికెట్ కౌంటర్ కోసం వెతుకుతూ ముఖద్వారం దగ్గరకి వెళ్ళినాము. అప్పుడు అక్కడ గేటు దగ్గర ఉన్న గార్డుని 30 రూ॥లు టికెట్ ఇచ్చు కౌంటర్ ఎక్కడ ఉంది అని అడిగాము. ఆయన మా మాటలు పట్టించుకోకుండా 'మీరు లోపలికి వెళ్ళాలా? అని అడిగి, తలుపు తీసి మా అమ్మగారితో కూడా నన్ను తోడుగా పంపించారు. సరాసరి 'క్యూ' లో నిలబడకుండా నేరుగా దర్శనం చేసుకొని 10 ని॥లలో బయటకు వచ్చాము. సద్గురు దర్శనము, దైవ దర్శనము సులభముగా అయినది.

నాకు ఎప్పటి నుండూ సైనస్ (తలనొప్పి) తో బాధ పడుతుండేదాన్ని. అది నేను తలనొప్పి అనుకునేదాన్ని. కాని నాకు సైనస్ అని తరువాత డాక్టరుగారి ద్వారా తెలిసింది. (అప్పుడు శిరిడీ కి ఫోను చేసాను) గొంతు పూడుకుపోయింది. చెవులు వినబడుట లేదు. శ్వాస ఆడటం కూడా కష్టంగా ఉండేది. తరువాత నాకు ఆపైన చెప్పిన లక్షణాలన్నీ క్రమంగా తగ్గిపోయి నేను ఆరోగ్యంగా ఉన్నాను.

నా యొక్క ఈ బాధలన్నీ డాక్టరు దగ్గరికి వెళ్ళకుండా 'శిరిడి' కి చేసిన ఒకే ఒక్క ఫోన్ నాకున్న సైనస్ ను తగ్గించారు. కంటికి రెప్పలాగ కాపాడే నా గురువు గారికి నేను ఏమి ఇవ్వగలను. ఒక్క కృతజ్ఞతలు తప్ప.

ఇట్లు

03-01-2001 — ఎస్. తులసి

## సాయిపథం హాయి (యీ) పథం

శ్రీ పూజ్య సద్గురు దేవులు శ్రీ సచ్చిదానంద సర్వసమర్థ సద్గురు శ్రీ సాయినాధుని శరత్‌బాబా మహరాజ్ దివ్య పాద పద్మములకు అనేకానేక సాష్టాంగ నమస్కారములు చేసుకుంటూ, శ్రీ గురుదేవులు చేసిన అద్భుత లీలను గురుబంధువులకు తెలుపుకుంటున్నాను.

మేము సాయిపథం పుస్తకము చదవడం మొదలు పెట్టిన తరువాత 20 రోజులకే శిరిడీ వెళ్ళే అనుగ్రహం కలిగింది. శిరిడీ వెళ్ళిన తరువాత ఆశ్రమంలో భజన జరుగుతూ ఉండగా బాగా జ్వరంగా ఉంది. నెప్పులతో బాధపడుతున్నప్పుడూ గురువుగారిని ప్రార్థించగా సువాసనలతో అనుభూతి కలిగి నెప్పులు తగ్గినవి. మేము శిరిడీ నుండి వచ్చే సరికి షిప్‌లో పనిచేస్తున్న మా బాబు వైజాగ్ వస్తున్నట్లు తెలిసింది. చాలా సంతోషించి అది అంతా గురువు గారి కృపగా తలచాము. మళ్ళీ మా బాబు అనుకున్నట్టుగా ఆరు నెలలకే వచ్చి మళ్ళీ మూడు నెలలకు అనుకున్న షిప్ నందే జేరడం జరిగింది. ఇదంతా గురువుగారి దయగా తలచాము. నా ఆరోగ్యం కూడా ఇంతకు ముందు కంటే మెరుగుపడింది. ఇలాగే గురువుగారు, బాబా గారి దయా, అనుగ్రహములతో మా ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి, మా చినబాబుకి ఉద్యోగం లభించి అంతా శుభం జరగాలని ఆశిస్తూ... ఈ అవకాశం కల్పించిన బాబాగారికి, గురువుగారికి మా అందరి... హృదయపూర్వక నమస్కారములతో

గురుబంధువు

శ్రీమతి శేషారత్నం మూర్తి.

## బాబూజీ సారథిగా

నా పేరు వరలక్ష్మి, ఎర్రజుట్టు అమ్మాయి అని మరో పేరు కూడా వుంది. తెనాలి మా వూరు. తెనాలిలోని కొత్తపేటలో వున్న, 'శరత్ గురుసన్నిధి' లో మేము వుంటాము. ఇక్కడ ప్రతి సంవత్సరము శ్రీసాయి పూజోత్సవాలు ఎంతో ఆనందంగా జరుపుతుంటారు - శ్రీ సాయి వరప్రసాదరావుగారు, కన్వీనరు శ్రీనరశింహరావుగారు, అదే విధంగా ఈ సం॥ జనవరి 19,20 వ తేదీలలో బ్రహ్మాండంగా, కన్నులవిందుగా, చాలా ఘనంగా జరిపారు. శ్రీసాయినాథుని శరత్‌బాబూజీవారు మొట్టమొదటసారిగా తెనాలి పట్టణానికి విచ్చేసి, ఈ తెనాలి గడ్డను తమ దివ్య పాదస్పర్శచే పునీత మొనర్చినపుడు ఆ మహానుభావుడు భక్తులకు ఒక గురూపదేశంగా ఒక దివ్య సందేశాన్నందించారట. అదేమిటంటే - 'అమూల్యమైన పెద్దది అయిన 'శ్రీసాయిబాబా' ఫోటో నొకదాన్ని ఆశీర్వదించి, తమ అమృత హస్తాలతో స్వయంగా కన్వీనరు శ్రీ నరశింహరావుగారి చేతికి అందిస్తూ, గురువుగారు ఇలా అన్నారట, 'దీన్ని జాగ్రత్తగా చూసుకోండి, సత్సంగం చేసుకోండి.' అని, ఈ శ్రీ నరశింహరావుగారే ఓసారి సత్సంగంలో చెప్తుంటే విన్నాను. ఇప్పుడు రామలింగేశ్వరపేటలో జరిగే శ్రీసాయిబాబా సత్సంగం కేంద్రములో 'శ్రీగురువుగారు స్వయంగా సత్సంగ నిమిత్తం ఇచ్చిన బాబా చిత్రం ప్రతి ఆదివారం వుంటుంది. గురువుగారు ఆనతిచ్చిన దగ్గరనుండి ప్రతి ఆదివారం 3 నుండి 5 గం॥ వరకు సత్సంగం చేస్తూ వస్తున్నారట. ఇది 10 వ శ్రీసాయి పూజోత్సవం అట. 'ట' అని ఎందుకు వ్రాస్తున్నానంటే, 1992 లో శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ వారు తెనాలిలో వున్నపుడు విశేషజనంతో పాటు మా అమ్మకూడా గురువుగారిని దర్శించుకొని వచ్చి, నన్ను కూడా వెళ్ళి దర్శనం చేసుకొని ఆశీర్వాదం తీసుకోమని, మంచి సంబంధం కుదిరి పెళ్ళి అవుతుందని, ఎంతగానో చెప్పింది. కానీ నా ప్రారబ్ధం చాలా బలంగా వుండటం వల్ల, ఆ మహనీయుని సన్నిధికి వెళ్ళి, ఆశీస్సులు అడగటానికి నా మనసు ఇష్టపడలేదు. నా ప్రారబ్ధం తొలిగిపోయి, మబ్బులు విడిపోయి, 'శరచ్చంద్రుని దర్శనం' నాకు లభించింది 1995 జనవరి 28న.

'ఒక జ్యోతిని వెలిగిస్తే, దానివల్ల అనేక జ్యోతులు వెలుగుతాయి' అన్నది అక్షరసత్యం. 'శ్రీసాయిబాబా సత్సంగం' అనే జ్యోతిని వెలిగించటానికి, శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ గారిని తెనాలికి తీసుకొచ్చారు. శ్రీసాయి

వరప్రసాదరావుగారు. ఆ యోగీశ్వరుని వెలుగులో నేడు ఒక్క తెనాలిలోనే అనేక సత్సంగ కేంద్రాలు వెలిశాయి. అన్తేకాకుండా తెనాలి పరిసర ప్రాంతాలకు ఈ వెలుగు ప్రసరించటం వల్ల, చుట్టు ప్రక్కల గ్రామాలలో నేడు వెలసిన సత్సంగాలు ఎన్నో? ఎన్నెన్నో? ఆదివారం వచ్చిందంటేచాలు, ఉదయం 7 గం॥లు నుండి రాత్రి 9 గం॥ల వరకూ సాయి నామం ఏదో ఒకమూల తెనాలిలో మారుమ్రోగుతూవుంటుంది. 10 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా కన్వీనరుగారు, సాయిగారు, సూర్యరధంలో శ్రీసాయిని, శ్రీసాయీశుని తెనాలి పట్టణంలో వూరేగించాలని నిర్ణయించుకొన్నారు. భక్తుడైన వాడు తన ఇష్ట (ఆరాధ్య) దైవాన్ని ఏవిధంగానైనా సేవించుకోవచ్చుకదా! ఈ విషయం శ్రీసాయి సచ్చరిత్ర చదివే, గురు బంధువులందరికీ తెలిసిన విషయమే. కొందరు నామం చెప్పటానికి ఉత్రూతలూగుతారు, కొందరు వంత పలకడానికే ఇష్టపడతారు. కొందరు తమ సేవను పూలతో తెలుపుకుంటారు బాబాకు. కొందరు ప్రసాదం ఇవ్వటం, కొంద్రరైతే తమ ఇంటినే సాయి మందిరంగా చేసుకొని సాయికి మందిరాలు కట్టించుకుంటున్నారు. ఎవరిష్టం వచ్చిన సేవ వారు తమ శక్తి కొలదీ చేసుకొంటున్నారు. నిండు హృదయంతో చేసే ఏ సేవ అయినా బాబా - గురువుగారు ఇష్టపడతారు. అదే విధంగా కన్వీనరు గారు, శ్రీసాయి వరప్రసాదరావుగారు సాయిబాబాను, గురువుగారిని ఒక్కోసారి ఒక్కోరకమైన వాహనంపై వూరేగించి ఆనందిస్తుంటారు. అది వారికిష్టమైన సేవ. ఈ సారి సూర్యరధంలో తెనాలి పురవీధులలో వూరేగించాలనుకున్నట్టున్నారు వీరు.

నేను ఇంటినుంచి చాలా లేటుగా బయలు దేరటం వల్ల వూరేగింపుకు అందుకోలేనేమోననిపించింది. చకచకానడచుకుంటూ చిట్టి ఆంజనేయస్వామి గుడి దగ్గర కళ్ళే సరికి, 'పలకండి పలకండి సాయి నామం, మీరు పలకమంటే పలకరేమి సాయి నామము' అన్న పాట వినిపిస్తున్నది. ఆ పాట నా చెవుల పడగానే ఒక్కసారిగా నా శరీరం పులకరించి పోయింది, ఇంకాస్పీడుగా నడిచి, శ్రీసాయిమందిరసత్సంగకేంద్రం దగ్గరకు చేరుకున్నాను. సాయినామం జోరు, రథ అలంకరణ, గుర్రాలు, శ్రీసాయినాథ్ మహరాజ్‌కీ జై!, సద్గురు శ్రీసాయినాధుని శరత్‌బాబూజీకీ జై!, అంటూ ఆ కోలాహలము, ఆనందంతో కేరింతలు, టపాసులమోతలు, ఆనందోత్సాహము చూచిన నాకు ఎంత సంతోషం కలిగిందో మాటలలో వ్రాయలేను. అంతచక్కటి సన్నివేశం చూచిన నాకళ్ళు ఆనందభాష్పాలతో నిండిపోయాయి సంతోషంతో...

బండిమీద ఎత్తుగా అమర్చిన సూర్యరధానికి రెండు గుర్రాలను మాత్రమే పూంచారు. తేవటమైతే 7 తెచ్చారట. కాని తెనాలి వీధులు ఇరుకుగా వుండటం వల్ల, గుర్రాలకు, ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని ఆలోచించి, రెండు గుర్రాలు మాత్రమే బండికి కట్టారు. యోగి రాజైన శ్రీసాయిమహరాజ్ దర్జాగా ఆశీనులయ్యారు. శ్రీసాయిమహరాజ్ రాజాధిరాజుకదా! అందుకని సాయుధులైఅం ఇరువురు పురుషులు రక్షకభటుల వేషధారణలో శ్రీసాయి రధానికి ఇరువైపులా గుర్రాలపైన, పెద్ద పెద్ద బల్లెములు చేత పుచ్చుకొని, హుందాగా కూర్చుని వున్నారు. సూర్యరధంలో రెండుగుర్రాలపగ్గాలను చేతపుచ్చుకొని ఫోటోరూపంలో 'సారధిగా' శ్రీగురువుగారు కూర్చున్నారు. మంగళగిరి రాధాకృష్ణగారు రచించిన సాయిపథము సాయిపథము అన్న పాటలో బాబూజీ సారధిగా... అనే రాశారు. బాబూజీ సారధిగా.... అన్న వాక్యం హృదయాన్ని కదిలించి వేస్తుంది. అంత భావగర్భితంగా మంగళగిరి రాధాకృష్ణగారు వ్రాసారు ఆ పాటను. ఈ సూర్యరధంలో రధనగలలో బాబూజీని చూచిన నేను, బాబా ఏ రధమెక్కినా, దానికి సారధి బాబూజీయే అనిపించిందినాకు. మంగళగిరి రాధాకృష్ణగారు ఎంతటి భావగర్భితంగా వ్రాసారో... అంత భావగర్భితంగానే, శ్రీసాయి వరప్రసాదరావుగారు ఎల్.కె.జి. పిల్లలకు బొమ్మలరూపాలను

చూపించి, అక్షర జ్ఞానం కలుగజేసినట్లు, రాధాకృష్ణగారి కవిత్వానికి, శ్రీసాయి గారు గురువుగారిని ఫోటోరూపంలో వుంచి ప్రాక్టికల్‌గా చూపించి, గురుబంధువులందరికీ ఎంతో ఆనందాన్ని కలుగజేశారు.

వూరేగింపు బయలుదేరటానికి అంతా సిద్ధంగా తయారైంది. కరతాళములతో సాయినామం పలుకుతూ, స్త్రీలు, పురుషులు పెద్ద క్యూ లో బయలు దేరటానికి సిద్ధంగా వున్నారు. వారి ముందు పెద్ద బ్యానరు, దానిమీద పెద్ద పెద్ద అక్షరాలలో 'శ్రీసాయి పూజోత్సవాలు, నిర్వహణ, శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ' అని, వారి ముందు 'సాయినామం' చెప్పుటలో అలుపుసొలుపు అనునది ఎరుగక, నర్తిస్తూండే గురుబంధువుల బృందం, వారి ముందు సాయినామానికి వంతవాయిస్తూ పెద్ద బ్యాండు మేళం, ఇంత అట్టహాసంతో, రాజలాంఛనములతో వూరేగింపునకు బయలు దేరబోతున్న శ్రీసాయి మహరాజ్, సద్గురు శరత్ గురు మహరాజ్‌ని చూస్తూ, నేను రథం వద్దనుంచి బ్యాండు మేళం దగ్గరకు, బ్యాండు మేళం నుంచి మళ్ళీ రథం దగ్గరకు వచ్చాను, ఏమిటో, నాకే తెలియని హడావుడిలో క్యూ సన్నగా కదిలింది.

శ్రీ నరశింహరావుగారు ఒకమంచి ఆటగుర్రాన్ని కూడా తెచ్చారు. తెనాలి పట్టణ పురవీధులలో వూరేగుతున్న బాబా-బాబూజీలు పుర ప్రజలందించే హారతులందుకుంటూ, వారికి ఆశీస్సులందిస్తూ... వీధులు తిలకిస్తూ సాగుతున్నారు. సూర్యరథంలో, అక్కడక్కడా సూర్యరథాన్ని, సాయిసేనను ఆపి, గుర్రం నాట్యం కూడా తిలకించారు. సాయి-గురూజీలు, వీరితోపాటు మేమందరంకూడా గుర్రం ఆటచూశాము. సాయినామం చెప్పే తాళానికి అనుగుణంగా గుర్రం చేసే నాట్యం అందరిని ఆశ్చర్యచకితులను చేసింది. సాయిబాబా...సాయిబాబా...సాయిబాబా అన్నప్పుడా గుర్రం ముందరి రెండుకాళ్ళు పైకెత్తటం, సొగసుగ, గర్వంగా నడుంకదిలిస్తూ, హుందాగా తోకాడిస్తూ... గుర్రం కూడా నర్తిస్తున్నదంటే, సాయినామం అనే రుచు అది కూడా మరిగింది అన్పించింది. కోట్ల గుర్రాలలో ఈ గుర్రమే సాయినామానికి నాట్యం చేసిందీ అంటే... అది బాబా-బాబూజీలకే తెలియాలి.

2002 జనవరి 19,20 శ్రీసాయిపూజోత్సవాలు ఇంత అద్భుతంగా జరగటానికి కారణం. శ్రీగురువుగారి ఆశీస్సులే... వచ్చే శ్రీసాయిపూజోత్సవాలకి, శ్రీసాయీశుడు తెనాలికి రావాలని కోరుకుంటున్నాను.

ఇట్లు
పులుపాటి వరలక్ష్మి

## "గురువేభిషగ్వరుడు"

నా పేరు నంబూరు హేమలత. నేను కృష్ణామాష్టారు గారి సత్సంగానికి వెళ్తాను. మా అబ్బాయి కూడా బాబానే తలుచుకుంటాడు. మా అబ్బాయి నన్ను గుడివాడ తీసుకు వెళ్ళటానికి తెనాలి వచ్చాడు. మేము కృష్ణామాష్టారు గారి ఇంటి ముందు బాబా మందిరములో నమస్కారం చేసుకొని గుడివాడ వెళ్ళాము. విజయదశమి రేపు అనగా స్కూటర్ యాక్సిడెంట్ అయినది. బాగా దెబ్బలు తగిలాయి. కన్నుకి కూడా బాగా దెబ్బ తగిలింది. బాబా దయవల్ల వారం రోజుల్లో కన్ను రిలీఫ్ ఇచ్చింది. కన్నుకి అంత పెద్ద దెబ్బ తగిలినా కూడా ఏ మాత్రము నొప్పిగా లేదు. కనుగుడ్డు బాగా వాచింది. అయినా నీరు కారలేదు. నొప్పి అనిపించలేదు. ఈ విషయం తెలిసిన డాక్టరుగారు చాలా ఆశ్చర్యపోయారు. కన్నుకి దెబ్బతగిలి, కనుగుడ్డు వాచినా నొప్పి కలుగకపోవడం చాలా అదృష్టం

అన్నారు డాక్టరు గారు. బాబా మరియు గురువుగారు మాయందు ఉండటం వల్ల కొద్దిలో ప్రమాదం తప్పింది. లేకపోతే బాగా ప్రమాదమని చెప్పారు డాక్టరుగారు. బాబా, గురువు గారి అనుగ్రహం వల్ల మా అబ్బాయికి పూర్తిగా తగ్గిపోయింది.

నాకు ముగ్గురు మగపిల్లలు మా కష్ట సుఖాల్లో బాబా, గురువుగారు, నా యందు, నా బిడ్డల యందు ఉంటారని నా నమ్మకము. మేము ఎల్లపుడు బాబా గారిని, గురువుగారిని తలచుకుంటాం.

నమస్కారములతో

నంబూరు హేమలత.

## నాటి బాబా - నేటి గురువే

నేను మొదటిసారి బాబూజీ దర్శనార్థం నాకున్న యిబ్బందుల కారణంగా మా బంధువు అయిన ఉమారాణి పెదరాపూరు ( వారింట్లో ప్రతి గురువారం సత్సంగం జరుగుతుంది). మా పిన్ని (హైదరాబాదు) తో కలిసి దసరాకు శిరిడి వెళ్ళడం జరిగినది. బాబూజీగారి దర్శనంలో నేను చెప్పుకొన్నది 'నేను ఆర్థికంగా చాలా ఇబ్బందులలో ఉన్నాను. అవితీరాలని బాబూజీ గారిని వేడుకున్నాను. వేడుకొన్న నేను మా వూరికి రాకమునుపే దానికి పరిష్కారంగా నా ఇబ్బందులు తొలగే మార్గాన్ని నాకిచ్చారు. (మా బాబాయి ఉత్తరం వ్రాసినారు నాకు ఉద్యోగం ఇస్తున్నట్లు). నేను వాళ్ళని ఎప్పుడు ఉద్యోగం అడగలేదు. అయినా వాళ్ళు నీవు ఉద్యోగంకు వస్తావా అమ్మా అంటు ఉత్తరం వ్రాసారు. ఎల్.బి.రెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్, వెల్వడం, మైలవరంలో లైబ్రరియన్‌గా నెలకు రూ. 1500/- + ఇల్లు + భోజనం. 2 సం॥ తరువాత 3000 రూ/- జీతం ఇస్తారు.

నాకిచ్చిన ఈ అనుభవం బాబా చరిత్రలో ఇబ్బందుల్లో వున్న సదాశితార్కాడ్‌ను పునే మీదగా మీవూరు వెళ్ళు అని చెప్పిన బాబా అతనికి ఉద్యోగాన్ని మార్గమధ్యలో అందించడంలా, నేను శిరిడీలో బాబూజీకి విన్నవించుకొన్న వెంటనే నా ఇంటికి నాకు ఉద్యోగం ఇస్తాం అని రాయడం నాకెంతో ఆనందాన్ని, అనందంతోటి కృతజ్ఞత, ఆ కృతజ్ఞత నాలో విశ్వాసాన్ని పెంపొందించాయి.

ఇట్లు : నాగసాయి

## ఆచేయి ఎంత హాయి

డా॥ ఎస్. సాయివరప్రసాదరావు

'తెలియగ తరమా జగతికి లీల' అనే పాటను ఈల పాట రఘురామయ్య నారద పాత్ర ధరించి పాడగా నా చిన్న తనంలో ఎన్నోసార్లు చూచాను, విన్నాను. అప్పటి వయస్సులో పాటబాణి-రాగం- గొంతు నచ్చినందున పదే పదే పాడుకొనేవాడిని. భావం తెలిసి కాదు. హృదయానికి హత్తుకొనిన పాటది. చాలా సంవత్సరాలైపోయింది. గురువు గారితో పరిచయమైంది. గురువుగారు గురువుని గూర్చి, బాబాను గూర్చి చెప్పినప్పుడూ గురు అంటె ఏమిటో అర్థమైంది.

కాలగతానుక్రమంగా, గురువుగారి దయవలన గురుమహిమ అవగతమైంది. మరి కొంతకాలం గడచిన తరువాత గురువు యొక్క ఆవశ్యకత, అవసరము (అన్ని మార్గాలకు) బోధపడింది. మరిన్ని రోజులు గడిచిపోయిన తర్వాత గురువు మనలను మనకు తెలియకుండానే ఎన్నో విషయాల్లో ఎలా రక్షించి దరికి చేరుస్తారో బోధపడింది. కొన్ని సమయాల్లో కాపాడేందుకు ఆ మహనీయుడెన్ని అవతారాలెత్తుతారో తేటతెల్లమైంది. గురువుగారి సాన్నిధ్యాన్ని అనుభవిస్తున్నకొద్ది ఎన్నో మధురిమలు, మరెన్నో మరుపురాని భావాలు ఆకళింపులౌతున్నాయి. ఇదెలా! జరిగిందో, జరుగుతుంటుందో మన వూహకు అందేలోపే గురువనుగ్రహం అందుకోగల్గుతున్నాము.

'సద్గురు చరణ సన్నిధి ఇహపరములకు పెన్నిధి' అనే వాణి యధార్థమే. ఒక మహనీయునిబోధ వల్ల మరో వ్యక్తిలో విశిష్టమైన మార్పు వచ్చిందంటే అది ఆ మహనీయుని మహిమేనని కొనియాడాలి. ఆకీర్తి, ఆ ఘనత-ఆమహనీయునిదేగాని, మారిన వ్యక్తిలోని వ్యక్తిత్వపు విలువలతో చూస్తే, అతని గత కాలాన్ని వివరిస్తే మారిన వ్యక్తిని కించపర్చినట్లుగా భావిస్తే గురువు నెలా? అర్థం చేసుకుంటున్నామో! తెలియకుంది. ఉదా॥ దురంతాలు, దుచ్చేష్టితములే బ్రతుకుబాటగా, దారిదోపిడీలు - జీవన యాత్రగా సాగించు బోయవాడు నారద మహర్షి ప్రేరణతో 'రామనామ' జపప్రభావంతో ఆదికవిగా భాసించిన వాల్మీకి చరిత్రను చదివినపుడు మనకు కలిగిన భావమెలా ఉండాలి. రామనామ మహిమ దుశ్శీలుని సైతము సజ్జనునిగా తీర్చిదిద్దగలిగేంత మహిమ గలదని తలపోయాలే తప్ప వాల్మీకి మహర్షిని కించపర్చుటమని భావిస్తే పొరపాటే.

కాలయవనునికడముట్టించి ముచికుందునకు మోక్ష మిచ్చిన సందర్భములో మురారే కన్పించాలి. కాల యవనుని కడతేర్చుటములోని అంతర్యమును గ్రహించాలి. నరకాసురుని పై విజయం ఇటువంటిదే.

అవతారాల ప్రయోజనం, పరమావధి దుష్టత్వ భావాలను తొలగించుటే శిశుపాల, పూతనాదుల వృత్తాంతమంటే రావణ, కుంభకర్ణాదులను సంహరించుటలోని ఆంతర్యమిదే.

వాల్మీకి రామాయణం రచించినా, వ్యాసులవారు భారత, భాగవతాదులను విరచించినా! దుష్టస్వభావాలను, దైవాంశసంభూతులైనవారు తొలగించి సన్మార్గానువర్తులను గావిస్తారనే భావమే గోచరిస్తుంది. అంగుళీమాలుడు ఈ కోవలోని వాడే, పై పాత్రలను గేలిచేసినారని ఆనాటి లోకవాసులంటే నేటి కాలానికి అవి మనచేతికి అంది ఉండేవికావు. యుగ యుగాలలో అవతరించిన మహాత్ములు కోర్కెలను తీర్చుటమేకాదు దుష్టభావాలను తొలగించి దైవత్వము సిద్ధించేలా! మనలను నడిపించడమే వారు చేస్తున్నారని తెలుసుకోవాలి. బుద్ధుడు, ఏసుక్రీస్తు ఇందులకు ఉదాహరణలు. ఇలాంటి వారు నేటికి మన సమాజంలో 'గురువుగారిలా' ఉంటారు. కబీరు మాటల్లో చెప్పాలంటే

'గూటిలో గుమికూడినవి కీటకాలు, వాటికమర్చు రంగు, అవయవాలు
అందుకనే గురువు భ్రమరం వంటివాడు, తనరంగు, తన రూపువచ్చువరకు నిద్రించడు.

ఈ క్రింది వాక్యాలను గమనించండి.

'తమిళనాడు రాష్ట్రంలో 40 ఏళ్ళ క్రితం అందరూ భగవంతుణ్ణి తిరస్కరించిన వారే. శ్రీరామునికి చెప్పులదండ వేయబడిందిక్కడే! కానీ వాళ్ళు ఆ పని ఇప్పుడు చేయగలరా.... ఇంకా చెప్పలేనన్ని మార్పులు వచ్చాయి. ఈ మార్పు కేవలం మహాత్ములవల్లనే (కంచి పెద్దస్వామి) సాధ్యపడింది. ('నివేదన' సాధన గ్రంధమండలి, తెనాలి 2001 సం॥ ముద్రణ, పేజి నెం43 గ్రహించారు)

బుద్ధుని ఆగమనంతో అంగుళీమాలునిలో పరివర్తన గమనించదగినది. ఇలాంటి ఉదాహరణలు చరిత్రకందినవి వేనవేలున్నవి. ఒక మహనీయుని ఆవిర్భావము వలన, ఒక దేశములోను, ఒక జాతిలోను, ఇంకా చెప్పాలంటే సాంఘిక, సాంస్కృతిక, మత, ఆచార, సంప్రదాయ, రాజకీయాదులలో విశిష్టమైన మార్పులు రావచ్చును. అదే విధంగా కొన్ని సందర్భములలో, సంఘటనల పరంగా ఒక వ్యక్తిలోను మహాత్ముని సందర్శనము వలనగాని, ఆశీర్వచనాదుల వలనగాని పెను మార్పులేర్పడి దైవభావగుణాలు అలవడి 'మనిషి దైవంగా ఎదగటం బాబామతం' అన్న స్థాయికి చేరవచ్చు గుర్వనుగ్రహంతో.

వ్రాత పూర్వకంగా మేమడిగిన ప్రశ్నలకు తెనాలి రామలింగేశ్వరపేట సద్గురు సాయినాథుని సత్సంగ కేంద్ర కన్వీనరు ఎమ్. నరసింహరావు గారు సమర్పించిన సమాధానముల సారాంశమును గురుకృప పాఠకులకు అందించుచున్నాము. గురువుగారి అనుగ్రహము - పరిచయభాగ్యము, వారిపట్ల తనకున్న సేవా తత్పరతలే అతనిలోని మార్పుకు ప్రధాన కారణమని సంతోషపూర్వకంగా చెప్పి యున్నారు. మీలోని లోపగుణాలను వ్రాయడం వలన మీకు బాధకలుగు తుందేమోనని ప్రశ్నించినపుడూ. ఇక్కడ ప్రధానమైంది నేను కాదండి, నాలోని అవలక్షణాదులను తుత్తునియలు చేసి సలక్షణమైన మనిషిగా తీర్చిదిద్దిన 'గురుకృపే' ఇందు ప్రధానంకాని ఇతరాంశాలకు తావెక్కడిది. ఇందువలన గురుకీర్తి గణుతికెక్కుతుందిగదా. నాకు నా గురుకీర్తి ప్రధానంగాని నాలోని అవలక్షణాదులను తెలియపర్చినందుకు నేనేమీ చింతించటంలేదు. నాకు లేని ఇబ్బంది మీకెందుకు. నిర్మొహమాటంగా నా విషయాలు సాటి గురుబంధువులకు తెలియజేయగలరు. నాకెలాంటి అభ్యంతరము లేదని తమకు మరోసారి మనవి చేస్తూ 'మనవి మాటలు' తెలియజేసుకొనుచున్నాను.

ప్రశ్న:- మీ వివరాలు తెలియజేయగలరు
జవాబు:- నా పేరు ఎమ్. నరసింహరావు తెనాలి బుర్రిపేలం రోడ్‌లో చిన్న మందులషాపుంది. అంతకు పూర్వము సీజనల్ మందుల వ్యాపారము చేస్తూ వుండేవాడిని. గుంటూరు-విజయవాడ ప్రాంతాలనుంచి మెడిసెన్స్ తెచ్చేవాడిని. అలాంటి సందర్భంలోనే గురుబంధువు ప్రస్తుతం హైదరాబాదులో వున్న శ్రీహనుమంతరావుగారితో నాకు పరిచయం ఏర్పడింది. తరువాత ఎమ్.బి.బి.ఎస్ చదివిన డాక్టరుగారి వద్ద కాంపౌండరుగా వుండి ప్రస్తుతం నేనే ఒక షాపు ఏర్పాటు చేసికొని జీవనం సాగిస్తున్నాను. నా కిద్దరబ్బాయిలు, ఒక అమ్మాయి.

ప్రశ్న:- మీకు గురుదేవులతో పరిచయమెలా కలిగింది?
జవాబు:- నా మిత్రుడు డా॥ జి. సాయివరప్రసాదరావు 1984 సం॥ నుండి వెంకటగిరిలో ఉన్నాడు. గురువుగారి పరిచయమతనికి అక్కడ ఆరంభమైంది. వేసవికాలం సెలవలకు తెనాలికి వచ్చినప్పుడల్లా తరచుగా మాషాపుకు వచ్చేవాడు. వచ్చినప్పుడల్లా నాకు, నాతోటి వారికి శరద్‌బాబూజీవార్ని గూర్చి చెప్పేవాడు. ముఖ్యంగా బాబాపై

ఆయనకున్న భక్తి ప్రపత్తులు జీవన సరళి, వారి మాటల ప్రభావము, అదృశ్యంగా కన్పించిన వారి మహిమ, వారి రచనాసరళి, వారి సాధారణ జీవనము ఆహారపుటలవాట్లు-జోకులు వేసేతీరు చెప్పేవాడు. వారి పాండిత్యాన్ని వేదాలపట్ల శాస్త్రాదులపట్ల కావ్యాదులపట్ల వారికున్న అపారప్రజ్ఞ తనను ఆకర్షించిందని ఆయా సంఘటనలు చెప్పేవాడు. కొన్ని సంవత్సరాలపాతుగా వారిని గూర్చి వినటం జరిగిందేకాని చూడటం జరగలేదు.

(మరిన్ని విషయాలు తెలియాలంటే గురుపూర్ణిమ దాకా ఆగాలి)

## 'మహనీయుల - మహితోక్తులు'

భారతావనిలో మహాత్ములెందరో ఆవిర్భవించి తమ అనుభవాన్ని ఆనాటి ప్రజలకు అందించి, అజ్ఞానాన్ని తొలగించి సక్రమమార్గాన నడిపించారు. ఆ అనుభవసారము ఆనాటికే పరిమితము కాలేదు. అప్పటి సంఘటనలే ఇప్పుడు కూడా పునరావృతమవుతున్నవి. అప్పటి సమాజంలో పదులసంఖ్యలో ఉంటే ఇప్పటిరోజుల్లో లక్షలాది ఉండవచ్చు. వాస్తవంగా చెప్పాలంటే ఆనాటి సూక్తులు ఈనాటికీ ఎంతో అవసరమనే భావనతో కబీరు దోహాలను తెలుగులోనికి అనువదించి గురుకృప పాఠకులకు అందించుచున్నాము. త్వరలో ఆచేయి ఎంతహాయిలో 'కబీరు జీవిత చరిత్ర' సంక్షిప్తంగా అందివ్వాలనే ప్రయత్నానికి గురుదేవులను ప్రార్థిస్తూ, ఆశీస్సులు కోరుతున్నాము. 'గురుకృప' సహకరించగలదనే ఆత్మవిశ్వాసంతో.

1\. విశాలమైన వలవిసిరాడు జాలరి. చిన్న చిన్న చెరువుల్లో ముప్పుతప్పనిసరి
చేరుకోచేపా! తెలుసుకో తరుణోపాయం. కబీరనుచున్నాడు గురువనే మహాసముద్రం

ఇందులో చక్కని 'శ్లేష' ఇమిడి ఉంది. 1. చేప పరంగా సాగేది. 2. మానవుని పరంగా సాగేది. చెరువు చిన్నదైనందున దానినాశ్రయించిన చేపకు జాలరి వలవిసిరిన కారణంగా దానికి ముప్పు తప్పదు. తాను ఆశ్రయించిన చిన్న చెరువును. అపాయాన్ని దాటాలంటే గురువనే పెద్దదైన సముద్రాన్ని చేరితే జాలరి నుండి ప్రాణాపాయం రాదు.

మానవపరంగా :- వల-యమపాశం, జాలరి-ప్రాణాలను హరించేవాడు, చిన్న చిన్న చెరువులు - తాను ఆశ్రయించిన వ్యక్తి - లేదా ఆరాధించేది. గురువే గొప్ప సముద్రం వంటి వాడని, సద్గురువుకు శరణాగతి చెందిన వారు సరిమార్గాన నడవగలరు. ఆధ్యాత్మికమైన ఇబ్బందులు, ఇతరాలు తొలగాలంటే చిన్న చిన్న వారిని ఆశ్రయించినందుకు ఫలితం శూన్యం. ఇది అనుభవం మీదగాని అర్థంగాదు. అవసరం 'మీద' ఉన్నంతవరకు అర్థం కాదు.

2\. నిను కన్నవారు నీ నుంచి దూరమైతారు, ఒకనాటికి నీవు తప్పక తరలిపోవాలి,
ఏనాటికైనా నీ బిడ్డలు వారిలా అనుసరించాలి. ఇక్కడ - అక్కడ ఏం జరిగిందో గమనించు.
కబీరనుచున్నాడు గురుచరణదాసుడవై పోవాలి!

పుట్టుట - గిట్టుటలే పరమావధికారాదు. మన తాత, తండ్రి, నీవు, నీ కుమారులు ఏనాటికైనా, ఒకనాటికి ఏకాడికి కాటికి చేరుకోవాలి. జీవన పరమావధి బ్రతికున్నంతకాలం మృత్యువుకు భయపడటంకాదు. మృత్యువును ఆహ్వానించే ధైర్యం. ఇక్కడ మృత్యువంటే - మరణంకాదు. జీవితంలో ఎదురయ్యే సమస్యలతో సతమతమై కుమిలి పోకుండా స్థైర్యంగా స్థిరపురుషుడు కావాలంటే గురుచరణ దాసునికే సాధ్యపడుతుందని భావము. 'పుట్టినందుకు గురుచరణములకు దాసుడవైనాకా! ఆ మాధుర్యము, ఆ ప్రభావము అర్థము కాగలదు.



# ఏమిటయా ఓ సాయి

ఏమిటయా ఓ సాయి! ఎందుకిలా ఉన్నానయ
కామంతో కాలిపోతు - మోహంతో మోసపోతు
పుట్టుకకే పురుడుపోస్తు - నీ ఉనికినే మరిచానయ ॥ఏమిటయా॥
మాతృగర్భమున పుట్టి - మమతలనే చెఱబట్టి
మనిషిలాగ ముసుగెట్టి - మానవతనే పాతిపెట్టి
మంగళరూపుని నిన్ను మఱుపులోకి నెట్టానయ ॥ఏమిటయా॥
డబ్బుమీద మనసెట్టి - జబ్బు కూడబెట్టి
డప్పులపై డబ్బెట్టి - అప్పు చాలపెట్టి
తెప్పరిల్లలేక నిన్ను తప్పించుకు తిరిగానయ ॥ఏమిటయా॥
మతాలనే మళ్ళుపెట్టి - మానవతను క్రుళ్ళబెట్టి
కులాలతో గోడకట్టి - వివేకాన్ని ఎండగట్టి
'మడి','తడి' అంటు - నిన్ను అంటలేక వున్నానయ ॥ఏమిటయా॥

-శ్రీ బాబూజీ-